సర్వేను పరిశీలించిన కలెక్టర్

సదాశివపేట : వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

సదాశివపేట, జనవరి 16 : మండల పరిధిలోని ఆరూర్‌లో రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేను కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా సర్వే పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులను క్షుణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో.,

జహీరాబాద్, జనవరి 16 : రైతు భరోసా, రేషన్‌కార్డులకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు మండల రెవెన్యూ, వ్యసాయాధికారులు కలిసి గ్రామాల్లో సర్వేలు చేపట్టారు. గురువారం సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి గ్రామాల్లో రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందించేందుకు యోగ్యంకాని భూములతో ఇంటింటికీ వెళ్లి రేషన్ కార్డుల మంజూరీ కోసం లబ్ధిదారుల ఇంటింటి సర్వే చేపట్టారు. ఆయా మండల రెవెన్యూ, వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పటాన్‌చెరులో తనిఖీ

పటాన్‌చెరు,జనవరి 16 : రేషన్‌కార్డుల సర్వే తీరును జిల్లా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్, చిట్కుల్, పాశమైలారం గ్రామాల్లో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి, పటాన్‌చెరు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పటాన్‌చెరు ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్‌గౌడ్ రేషన్‌కార్డులకు అప్లికేషన్లు ఇచ్చిన ప్రజల ఇం డ్లలో జరుగుతున్న సర్వేను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార బృందం మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల ను ఇచ్చేందుకు సర్వే నిర్వహిస్తున్నదన్నారు. ఈ నెల 16 నుంచి 20 వరకు సర్వే ఉంటుందని, ఆ తర్వాత గ్రామాల్లో 21 నుం చి 24 వరకు గ్రామసభలుంటాయ వివరించారు. కార్యదర్శి కవిత ఉన్నారు.

సర్వే తీరు పరిశీలన

రైతు భరోసా సర్వేను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

ఝరాసంగం, జనవరి 16 : మండల కేంద్రంలో ఏవో వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు భరోసా సర్వేను ట్రైనీ కలెక్టర్ మనోజ్ కుమార్ గురువారం పరిశీలించారు. అనంతరం ఈదులపల్లి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వేను పరిశీలించి, అవకతవకలకు చోటులేకుండా క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో సుధాకార్, ఏవో వెంకటేశం, సర్వేయర్ నర్సింలు, ఏఎస్‌వో రాజేశ్, పంచాయతీ కార్యాదర్శులు ఉన్నారు.

సాగు లేని భూముల వివరాలను సేకరించాలి

'ఖేడ్' ఆర్డీవో అశోక చక్రవర్తి

సర్వేకు అధికారులతో చర్చిస్తున్న ఖేడ్ ఆర్డీవో

సిర్గాపూర్, జనవరి 16 : వ్యవసాయానికి సాగుకు అనుకూలంగా లేని భూముల వివరాలను సేకరించాలని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి పేర్కొన్నారు. గురువారం ఆయన సిర్గాపూర్ మండల కేంద్రాన్ని సందర్శించి, రైతు భరోసా పథకం పట్ల అర్హులను గుర్తించేందుకు చేపట్టే సర్వే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ ఉమాశంకర్, వ్యవసాయాధికారి హరికృష్ణ, ఏఈవో భాస్కర్‌తో కలిసి క్షేత్రస్థాయిని సందర్శించి సాగు భూములను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 20వ తేదీ వరకు సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో ప్రభుత్వ స్వాధీనం చేసుకున్న ఇండ్ల స్థలాలు, పరిశ్రమలు, రోడ్లు, వ్యవసాయానికి వీలుకాని పడావు భూములు, లే ఔట్లు, మైనింగ్ భూములు అన్ని, భూ భారతి పోర్టల్ ద్వారా పరిశీలిస్తామన్నారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బృందాలుగా వీడి గ్రామాల్లో గ్రామ సభలో చర్చించి రైతు భరోసా పథకం నుంచి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తొలిగిస్తామని ఆర్డీవో వెల్లడించారు.

సర్వేను సక్రమంగా నిర్వహించాలి

వట్‌పల్లి, జనవరి 16: రైతు భరోసా సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఏడీఏ సత్యనారాయణ మండల అధికారులకు సూచించారు. మండల పరిధిలోని వట్‌పల్లి, ఖాదిరాబాద్, దేవూనూర్, మర్వెల్లి రెవెన్యూ గ్రామాల్లో రైతు భరోసా పథకం ఆర్హత కలిగిన భూముల నిర్ధారణ సర్వే మం డల వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లా రైతుల భూములను పరిశీలిస్తూ సర్వేను జరిపించాలని ఆదేశించారు. ఏవో శ్రీనివాస్ రెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

సర్వే పక్కాగా చేపట్టాలి

పుల్కల్ : సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో పాండు

పుల్కల్/అందోల్, జనవరి16 : రైతు భరోసా, రేషన్ కార్డులపై చేపట్టిన సర్వే పక్కాగా చేపట్టాలని అందోల్ ఆర్డీవో పాండు అన్నారు. గురువారం మండల కేంద్రమైన పుల్కల్‌లో రెవెన్యూ అధికారులుచేపట్టిన సర్వేను ఆయన తనిఖీ చేశారు. వ్యవసాయేత భూములను పరిశీలించారు. పుల్కల్‌లో అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి సర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ కృష్ణ ఆర్డీవోకు వివరించారు. ఆయన వెంట ఏవో చైతన్య, ఏఈవో మునీరా బేగం తదితరులు ఉన్నారు. ఆందోల్‌లోని దానంపల్లి, డాకూర్, నాదులాపూర్ తదితర గ్రామాల్లో రైతుల నుంచి వివరాలు సేకరించామన్నారు. వెంట తహసీల్దార్ విష్ణుసాగర్, డీటీ మధుకర్‌రెడ్డి, ఏఈవో శ్రీకర్ ఉన్నారు.

కల్హేర్ మండలాన్ని సందర్శించి ఏడీఏ

కల్హేర్, జనవరి 16 : కల్హేర్ మండలాన్ని నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్ కుమార్, ఏవో వెంకటేశం తో కలసి సందర్శించారు. ఈమేరకు మండలంలోని కల్హేర్, ఖానాపూర్ గ్రామంలో రైతు భరోసా పథకానికి సంబంధించి స్థానిక రైతులతో మాట్లాడారు. అయితే సాగుకు పనికి రాని భూములను గుర్తించేందుకు పక్కాగా సర్వే చేపట్టాలని ఆయన సూచించారు. ఏఈవో కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.

జహీరాబాద్‌లో పరిశీలిస్తున్న అర్డీవో రాంరెడ్డి

జహీరాబాద్‌లో..

జహీరాబాద్, జనవరి 16 : రైతు భరోసా సాయం అందించేందుకు చేపట్టిన సాగుకు యోగ్యంగానీ భూముల సర్వేను జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి పరిశీలించారు. గురువారం జహీరాబాద్ పట్టణ సమీపంలో రెవెన్యూ, వ్యవసాయాధికారులు చేపట్టిన భూముల సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రవీందర్, ఏడీఏ భిక్షపతి, ఏవో లావణ్య, ఏఈవో ప్రదీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

సంగారెడ్డిలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

మునిపల్లి, జనవరి 16 : ప్రభుత్వం అందించే రైతు భరోసా పథకం అర్హులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బుధేరాలో అధికారులు నిర్వహిస్తున్న రైతు భరోసా, రేషన్ కార్డుల ఇంటింటి సర్వేను సంగారెడ్డి ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచన, సలహాలు అందించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఆర్డీవో మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న రైతు భరో సా, రేషన్ కార్డుల సర్వేను పగడ్బందీగా నిర్వహించాలన్నారు. మునిపల్లి తహసీల్దార్ ఆశజ్యోతి, ఉప తహసీల్దార్ కృపనాందం, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, ఎఈవో స్నేహ తదితరులు ఉన్నారు.

బుధేరాలో రైతు భరోసా సర్వేను పరిశీలిస్తున్న అర్డీవో రవీందర్ రెడ్డి

'డబుల్' ట్రబుల్

- కొడకంచిలో మధ్యలోనే నిలిచిన డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం
- జిన్నారంలో పునాది దాటని పనులు.. తప్ప పట్టిన ఐరన్ రాడ్లు
- కొత్తపల్లిలో శంకుస్థాపనతోనే సరి

జిన్నారం (బొల్లారం), జనవరి 16 : బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం ఉమ్మడి జిన్నారం మండలంలో అర్ధాంతరంగా ఆగిపోయి ముందుకు కదలడం లేదు. మొదటి విడత కింద ఉమ్మడి జిన్నారం మండలానికి 150 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు కాగా, జిన్నారానికి 60, కొడకంచికి 50, కొత్తపల్లికి 40 ఇండ్లు కేటాయించారు. మూడు గ్రామా ల్లో ఇండ్ల నిర్మాణానికి స్థలాలను పరిశీలించి ఎంపిక చేసేందుకు చాలా సమయం పట్టింది. కొడకంచిలో పుట్టగూడ సమీపంలోని సర్వేనంబర్ 11లో 50 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అపార్ట్‌మెంట్ తరహాలో నిర్మించేందుకు స్థలం కేటాయించగా, 2019 ఫిబ్రవరి 5న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కొన్ని రోజుల తర్వాత జిన్నారం, కొత్తపల్లి గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. జిన్నారం, కొడకంచి, కొత్తపల్లి గ్రామాల్లో ఇండ్లను నిర్మించేందుకు ఒకే కాంట్రాక్టర్ ముందుకు రావడంతో నిర్మాణ పనులను అప్పగించారు. కాగా,కొడకంచిలో ఐదేండ్లుగా పనులు సాగుతూ ఆగుతున్నాయి. ఒక్క బ్లాకులో పన్నెండు డబుల్ బెడ్ రూమ్ చొప్పున నాలుగు బ్లాకులు మూడు అంతస్తులు నిర్మించారు. రెండు బ్లాకుల్లో ఇటుక గోడల నిర్మాణం మాత్రమే జరిగింది. మరో రెండు బ్లాకులు స్లాబుల స్థాయిలోనే ఉన్నాయి. 50 ఇండ్ల నిర్మాణానికి 48 మాత్ర మే నిర్మాణంలో ఉండగా మరో రెండు డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణంపై క్లారిటీ లేదు. జిన్నారం, కొత్తపల్లి గ్రామాల్లో కూడా అపార్ట్‌మెంట్ తరహాలోనే డబుల్ రూమ్ ఇండ్లకు శంకుస్థాపన, పనుల ప్రారంభోత్సవం జరిగినా పనులు ఆదిలోనే ఆగిపోయాయి.

జిన్నారంలో పునాది స్థాయిలో పనులు నిలిచిపోవడంతో తుప్ప పట్టిన ఇనుప రాడ్లు, పెరిగిన పిచ్చి మొక్కలు

పునాది దాటని పనులు..

తుప్ప పట్టిన ఇనుప రాడ్లు

మండల కేంద్రం జిన్నారంలో ఆరవై డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం పనులు పునాది స్థాయిలో నిలిచిపోయాయి. పుట్టింగ్‌లు ఏర్పాటు చేసి బేస్‌మెంట్ నిర్మించి వదిలేయడంతో ఐదేండ్లుగా వానకు తడిచి ఎండకు ఎండడంతో ఐరన్ రాడ్లు తుప్పు పట్టాయి. నిర్మాణాల మధ్య పెద్ద పెద్ద మొక్కలు పెరగడంతో అడవిని తలపిస్తోంది. నిలిచిపోయిన పనుల గురించి అధికారులు, నాయకులు గానీ పట్టించుకోకపోవడంతో పనులు అలాగే నిలిచిపోయాయి. ఒకవేళ పనులు మళ్లీ ప్రారంభించాలనుకున్నా ఇనుప రాడ్లు పనికి రాని పరిస్థితి ఏర్పడింది.

కొడకంచిలో రెండు బ్లాకుల్లో గోడలు మాత్రమే నిర్మాణం కాగా మరో రెండు బ్లాకులు స్లాబ్‌ల స్థాయిలోనే ఆగిపోయిన దృశ్యం

కొత్తపల్లిలో ప్రారంభం కాని పనులు

కొత్తపల్లిలో నలబై డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం స్థల సేకరణ ఆలస్యమైంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కానీ, పనులు మాత్రం ప్రారంభం కాలేదు. నిర్మాణ పనుల్లో ముందడుగు పడడం లేదు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇండిపెండెంట్‌గా నిర్మిస్తే బాగుండేదని, అపార్ట్‌మెంట్‌లాగా నిర్మించి అందరికీ ఒకే చోట ఇవ్వడమే బాగాలేదని మొదటి నుంచి ఇక్కడ విమర్శలు వక్తమవుతున్నాయి. కాగా, ప్రభుత్వం మారిన నేపథ్యంలో జిన్నా రం, కొడకంచి, కొతపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ప్రా రంభిస్తుందా లేదా అనేది ప్రశ్నగా మారింది.

క్రీడల్లో గెలుపోటములు సహజం

గెలుపొందిన జట్టుతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, తదితరులు

సదాశివపేట, జనవరి 16 : క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్టూర్‌లో పీఏసీఎస్ చైర్మన్ పబ్బతి రత్నాకర్‌రెడ్డి తండ్రి పబ్బతి నర్సింహారెడ్డి స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన కమాండోస్ లెవెన్ జట్టు, రన్నర్‌గా రైజింగ్ టైటాన్స్ జట్టుకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, మాజీ ఎంపీపీ యాదమ్మ కిష్టయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడీల సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్, మాణిక్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సయ్యద్ చోటు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొల్ల నవీన్, నాయకులు సురేందర్‌రెడ్డి, సురేశ్, శేఖర్‌గౌడ్, సతీశ్‌గౌడ్, శ్రీకాంత్, ప్రవీణ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బొక్కస్‌గాంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సిర్గాపూర్/ కల్హేర్, జనవరి 16 : నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి గురువారం సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించారు. ఈ మేరకు బాధిత కుటుంబాలకు ఆయన పరామర్శించారు. సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాంలో తిప్పన భూమవ్వ, శాంతమ్మ మృతిచెందారు. మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తదితరులతో కలిసి వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. కల్హేర్ మండలం మీర్‌ఖాన్‌పేటలో నీరుడి రాజమ్మ, నరసయ్య, మార్డి గ్రామానికి చెందిన ప్రేమ్, లచ్చవ్వ, రాపర్తి గ్రామంలో పనాది విఠవ్వ, నరసవ్వ ఇటీవల మృతి చెందారు. దీంతో వీరి కుటుంబాలకు ఆయన మండల బీఆర్ఎస నాయకులతో కలిసి పరామర్శించారు. పార్టీ అధ్యక్షులు రాంసింగ్, మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అలీ, నాయకులు జనార్దన్, కరణం రాజు, ప్రశాంత్‌సాగర్, భూమయ్య, వైజ్యనాథ్‌రావు, ప్రహ్లాద్‌రావు, జ్ఞాను పటేల్, కిష్టారెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

కోహీర్ మున్సిపాలిటీ వద్దని వినతి

సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కోహీర్, జనవరి16 : కోహీర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దని పలు పార్టీల నాయకులు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కోరారు. గురువారం కోహీర్‌లో చేపట్టిన రేషన్‌కార్డులు, ఆత్మీయ రైతు భరోసా సర్వేను అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కోహీర్ మున్సిపాలిటీ ఏర్పాటుపై పలు పార్టీల నాయకులు ఆయన దృష్టికి తెచ్చారు. 900 మంది నిరుపేద కూలీలకు ఉపాధిహామీ జాబ్ కార్డులు ఉన్నాయని గుర్తు చేశారు. కూలీ పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. మున్సిపాలిటీ ఏర్పడితే కూలీలకు ఉపాధిహామీ పథకం వర్తించదన్నారు. ఇంటి స్థలం, నిర్మాణం కోసం ఎక్కువ మొత్తంలో పన్నులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ ఉంటున్నది 90 శాతం మంది నిరుపేదలే నన్నారు. కోహీర్‌లో ముందుగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని నాయకులు విన్నవించారు. తహసీల్దార్ బాలశంకర్, ఎంపీడీవో భారతి, ఏవో నవీన్ కుమార్, కార్యదర్శి మిస్కీన్, తదితరులు ఉన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి చేస్తాం..

కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసిన ఓల్డ్ ఎంఐజీ కాలనీవాసులు

రామచంద్రాపురం, జనవరి16 : క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. భారతీనగర్ డివిజన్‌లోని ఓల్డ్ ఎంఐజీ సంకల్ప గ్రౌండ్ సొసైటీ రెసిడెంట్స్ సభ్యులు గురువారం కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో బ్యాడ్మింటన్ షెడ్ నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరించినందుకు కార్పొరేటర్‌కు వారు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.

పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

పటాన్‌చెరు నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రశాంత్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి తన నివాసంలో పాస్టర్ ప్రశాంత్‌కి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జోసఫ్ తదితరులు ఉన్నారు.

పాతపంటలను కాపాడుకుందాం..

పాతపంటల జాతరలో ఎడ్ల బండ్లకు స్వాగతం పలుకుతున్న గ్రామ ప్రజాప్రతినిధులు, డీడీఎస్ మహిళలు

జహీరాబాద్, జనవరి 16 : పాత పంటలలో పోషక పదార్థాలు అధికంగా ఉంటాయని జహీరాబాద్ డీడీఎస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దివ్య వెలుగురి అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని శంషోల్లాపూర్‌లో పాతపంటల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత పంటలైన తైదలు, కోర్రలు, సామలు, సజ్జ, జొన్న, పెసర, మినుము తదితర పంటలలో అనేక పోషక పదార్థాలు అధికంగా ఉంటాయని, వాటిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డీడీఎస్ మహిళ సంఘాల సభ్యులు, మహిళల కోలాటం, చిటికెల రామాయణం, ఆటపాటలతో పాతపంటల విత్తనాలతో కూడిన ఎడ్లబండ్లతో ఊరేగింపును చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ జాతర కో-ఆర్డినేటర్లు విజయ్ కుమార్, మంజుల, గ్రామ మహిళ రైతులు పాల్గొన్నారు.

జాతరలో మాట్లాడుతున్న ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దివ్య వెలుగురి

రోడ్డుపైకి విస్తరించిన చెట్ల కొమ్మలు తొలిగింపు

చెరువు కట్ట రహదారిపై చెట్ల కొమ్మలను తొలిగిస్తున్న మున్సిపల్ కార్మికులు

జిన్నారం (బొల్లారం) జనవరి 16 : రోడ్డుకిరువైపులా దట్టంగా పెరిగిన చెట్ల కొమ్మలతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు అడ్డంకిగా మారాయి. ప్రజల అవస్థలు గమనించిన చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ కార్మికులతో గురువారం చెట్ల తొలిగింపు చర్యలు చేపట్టారు. కుడి కుంట చెరువు కట్ట నుంచి వెళ్లే మార్గంలో చెట్ల కొమ్మలు రోడ్డు పైకి భారీగా విస్తరించడంతో వాహనదారులు, పాదచారులు ఇక్కట్లకు గురవుతున్నారు. సమస్యను గుర్తించిన అధికారులు మున్సిపల్ కార్మికులతో చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు, ముండ్ల చెట్లను పూర్తిగా తొలిగించారు. అధికారుల చర్యలతో వాహనదారులు, పాదచారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో చిన్నారి మృతి

రాయికోడ్, జనవరి 16 : వారం రోజుల కింద ఇంటి నుంచి అదృశ్యమైన చిన్నారి బావిలో శవంగా మారిందని స్థానిక ఎస్సై నారాయణ తెలిపారు. తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంగాపూర్ గ్రామానికి చెందిన మధుగడ సతీశ్‌కు అదేగ్రామానికి చెందిన ఎరుకలి అనితతో 12 ఏండ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుర్లు హరిత(6), వైష్ణవి(11). రెండు నెలల కింద భార్యాభర్తల మధ్య విబేధాలు రావడంతో అనిత ఇంటి నుంచి వెళ్లిపోయింది. నెల కింద చిన్న కూతురు హరిత చనిపోయింది. వైష్ణవి వారం రోజుల కింద ఇంటి నుంచి అదృశ్యమై గురువారం గ్రామ శివారులో వ్యవసాయ బావిలో శవంగా మారింది. మృతురాలు నాన్నమ్మ సమ్మమ్మ ఫిర్యాదులో మనుమరాలు వైష్ణవి అనుమానాస్పదంగా మృతి చెందిందని దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి నాకు న్యాయం చేయాలని ఆమె కోరింది. ఈ విషయంలో ఎస్సై నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఒకే ఇంటిలోనే రెండు నెల వ్యవధిలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫుడ్ సెక్యూరిటీ కార్డుల పరిశీలనపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

జిన్నారం (బొల్లారం) జనవరి 16 : ఫుడ్ సెక్యూరిటీ కార్డుల జారీలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బొల్లారం మున్సిపల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి, కమిషనర్ మంగతాయారు సూచన మేరకు ఆర్వో నర్సింహులు, మేనేజర్ మల్లికార్జున్ సంయుక్తంగా అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న 1435 మంది లబ్ధిదారుల దరఖాస్తులను వార్డుల వారీగా 22 వార్డులకు పరిశీలన అధికారులను నియమించా రు. వార్డు ఆఫీసర్లు, జూనియర్ అసిస్టెం ట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు వినతి

జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు, జనవరి 16 : పటాన్‌చెరు డివిజన్‌కు నిధులు మంజూరు చేయాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గురువారం పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని, ఎస్ఈ శంకర్‌నాయక్‌లను వారి కార్యాలయంలో కలిశారు. పటాన్‌చెరు డివిజన్‌లో పలు కాలనీల్లో సరైన లైట్లులేవని, అల్విన్ కాలనీ నుంచి సింఫని కాలనీ వరకు ఆక్టాగోనల్ విద్యుత్ స్తంభాలతో పాటు అధునాతన లైట్లను అమర్చాలని కోరారు. జోనల్ కమిషనర్ వినతులపై సానుకూలంగా స్పందించారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి

సదాశివపేట, జనవరి 16 : సీపీఎం రాష్ట్ర నాల్గో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 25న సంగారెడ్డిలో జరిగే భారీ బహిరంగ సభలో ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు రమేశ్‌గౌడ్, భూషణం, ఏసేబు, నాయకులు నాగరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలి

అందోల్, జనవరి 16 : మండలంలోని అక్కాన్‌పల్లిలో గురువారం దొంగలు హల్‌చల్ చేశారు. పండుగ కావడంతో ఓ మాజీ ప్రజా ప్రతినిధి ఇంటికి తాళంవేసి ఊరెళ్లగా ఇదే అదునుగా దొంగలు తమ చేతి వాటం చూపెట్టారు. ఇంట్లో సీసీ కెమెరాలు ధ్వంసం చేసి మరి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లగా, మరికొంత మంది ఇండ్లలో చోరీకి ప్రయత్నించి విఫలమైననట్లు గ్రామస్తులు తెలిపారు. మూడు రోజుల కింద సైతం సంగుపేట గ్రామంలో వరుసగా నాలుగిండ్లలో దొంగతనం జరిగింది. వరుస పెట్టి నాలుగిండ్లలో చోరీకి పాల్పడి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామాల్లో ద